క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ



మక్కపేట(వత్సవాయి): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు ప్యాడ్లు, పెన్నులను శనివారం అందజేశారు. గ్రామంలోని జెడ్పీ పాఠశాల నుంచి పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే 25 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థులు గూడెపు అంజి, గుడేటి రమేష్ ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. హెచ్ఎం పిచ్చేశ్వరమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పదోతరగతి పరీక్షల్లో 550కిపైగా మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి నగదు బహుమతిగా రూ.5,116 లను అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజ్మీరు శ్రీనివాసరావు, ప్రసాదు, డి.శ్రీనివాసరావు, దుర్గారావు, రెడ్డి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు



చిట్టేల(వత్సవాయి):ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయాలపాలైన సంఘటన శనివారం చిట్టేల గ్రామశివారులో చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. చిల్లకల్లు వైపు నుంచి వత్సవాయి వైపునకు ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు ఎదురుగా వస్తున్న వృద్ధురాలిని తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్రంగా గాయాలు కావడంతో స్థానికులు స్పందించి ఆటోలో అతన్ని జగ్గయ్యపేట వైద్యశాలకు తరలించారు. కాగా యువకుడు వివరాలు తెలియరాలేదు. ఘటనపై కూడా పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై వ్యాపారులకు అవగాహన

నందిగామ టౌన్: ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతోందని మున్సిపల్ కమిషనర్ రమణబాబు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో ప్లాస్టిక్ నిర్మూలనపై వ్యాపారులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మైక్రాన్స్ కన్నా తక్కువ సాంద్రత కలిగిన కవర్‌లను వినియోగించకూడదన్నారు. ముఖ్యంగా హోటళ్ల, టీస్టాళ్ల, కర్రీ పాయింట్‌లు, టిఫిన్ సెంటర్లలో కవర్లను విపరీతంగా వాడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్), వాగ్దేవి, అమ్మాణీ, జేఆర్‌సీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు పరీక్షల విభాగం కస్టోడియన్ శౌరిలమ్మ తెలిపారు. ఈనెల 17,18 వ తేదీలలో ఒకేషనల్ కోర్సు(బ్రిడ్జి కోర్సు) పరీక్షను స్థానిక జేఆర్‌సీ కళాశాలలో జరుగుతుందని, దానికి ప్రథమ సంవత్సరం 284 మంది, ద్వితీయ 173 మంది కలిపి మొత్తం 457 మంది హాజరవుతారని వివరించారు.

మద్యాన్ని ఎమార్పీకే విక్రయించాలి

తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఎక్సైజ్ సీఐ గురవయ్య శనివారం ఆదేశించారు.ఇటీవల ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలను లాటరీ ద్వారా పొందిన వ్యక్తులు త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జగ్గయ్యపేట, చిల్లకల్లు, వత్సవాయి మండలంలోని ఆయా దుకాణాలను మిట్టగూడెంకు చెందిన గజ్జా హరికృష్ణ, ఏకొండూరుకు చెందిన పంబి మోహనరావు, కంభంపాడుకు చెందిన గాలి కోటమ్మలకు కేటాయించినట్లు చెప్పారు. ఈ దుకాణాలను రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు.

గ్రామ కార్యదర్శులతో సమావేశం

వీరులపాడు: గ్రామ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండలంలోని జుజ్జూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మండలంలోని గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలకు ఉపాధి కూలీలు విలవిల

- కూలీలు పనిచేసే చోట రక్షణ కరువు
- అందుబాటులో లేని ఫస్ట్ ఎయిడ్ కిట్లు
- తాగునీటి వసతి కల్పించని అధికారులు
- తీవ్ర ఇబ్బందుల్లో ఉపాధి కూలీలు



కంచికచర్ల మండలం గండేపల్లిలో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

కంచికచర్ల : వేసవి రాకముందే మండుతున్న ఎండలకు ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలు విలవిలలాడిపోతున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో నెల రోజులుగా ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. నీటి సేద్యపు గుంటలు, రోడ్ల పక్కన కందకాలు, రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించే పనులు, ఇళ్ల వద్ద నీటి గుంటలు తవ్వకాలు పనులు చేపట్టారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ కూలీలకు తగిన రక్షణ చర్యలు కల్పించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

నీరసించిపోతున్న కూలీలు..

ఎండల తీవ్రతకు కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. కూలీలతో చేయించే పనులను రెండు పూటలా ఫొటోలు తీసి మస్టర్ నమోదు చేయాలంటూ మెలిక పెట్టడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ఎండలతో ఫొటో విధానాన్ని మార్చాలని కూలీలు డిమాండ్ చేస్తున్నా, తామేమి చేయలేమంటూ స్థానిక సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఉపాధి పనులు చేసే గ్రామలన్నింటిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆమధ్య మండలంలోని పేరకలపాడులో ఎండ తీవ్రతకు ఓ మహిళా కూలీ అస్వస్థతకు గురైంది. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటతో కూలీలు బెంబేలెత్తిపోతున్నారు. పనులు చేసే ప్రాంతంలో నీడ కోసం షామియానా టెంట్ వేయించాలని, తాగునీరు, మజ్జిగ వసతి కల్పించాలని ఉపాధి హామీ పథకం కూలీలు కోరుతున్నారు. పనిచేసే సమయంలో ఏదేని చిన్నపాటి ప్రమాదం జరిగితే ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేకపోవడంపై కూలీలు పెదవి విరుస్తున్నారు. రెండు పూటలా ఫొటో విధానాన్ని రద్దుచేసి ఉదయం 10.30 గంటలకే పని పూర్తి చేసే విధానాన్ని అమలుచేయాలని కూలీలు కోరుతున్నారు.

రెండునెలలుగా బిల్లులు ఇవ్వలేదు...

ఉపాధి పనులు చేసే ప్రాంతంలో తాగునీరు అందుబాటులో ఉంచడం లేదు. రెండు నెలల నుంచి పనులు చేసిన ఎటువంటి బిల్లులు రాలేదు. పనిముట్లు కూడా ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి పనిముట్లు ఇవ్వడంతోపాటు బిల్లులు చెల్లించాలి.
– కుమారి, ఉపాధి కూలీ, కంచికచర్ల

కూలీలకు రక్షణ కల్పించాలి...



వేసవి ఎండల తీవ్రత రోజుకు రోజుకు అధికమవుతుండటంతో ఉపాధి పనులు చేసే కూలీలకు పనిప్రాంతంలో నీడ కోసం షామియానా ఏర్పాటు చేయాలి. ఏదేని ప్రమాదం జరిగిన సమయంలో ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. – కోట కళ్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి, కంచికచర్ల

మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్

వత్సవాయి: మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండేపుడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. వత్సవాయిలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మిర్చి రైతులు గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరం సాగుకు రూ.50 వేల వరకు నష్టాలు చవిచూస్తున్నారన్నారు. గతంలో ఇదే మిర్చి పంట క్వింటాకు రూ. 25 వేలు పలికితే ప్రస్తుతం రూ.11వేలు మాత్రమే ఉండటంతో రైతులకు నష్టాలే మిగిలాయన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి క్వింటాకు రూ.25 వేలు ఇవ్వడం ద్వారా గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18,19తేదీల్లో రైతుసంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వత్సవాయిలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘ నాయకులు కంచర్ల కొండయ్య, కూరపాటి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఏసీపీ తిలక్

నందిగామరూరల్:విద్యార్థులు క్రమశిక్షణతో విద్య నభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఏసీపీ తిలక్ సూచించారు. మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు శనివారం ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యావంతులుగా ఎదగాలన్నారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. పది పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటి విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి ఏటా పది మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల రాంబాబు, షేక్ నాగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ప్లాస్టిక్ హానికరం



పెనుగంచిప్రోలు: పర్యావరణాన్ని ప్లాస్టిక్ నాశనం చేస్తుందని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక సచివాలయం వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని నాశనం చేసే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతిఒక్కరు నిషేధించాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం దుకాణదారులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలంటూ నోటీసులు అందజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్ల కోటేశ్వరి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, దుకాణదారులు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీకృష్ణ కల్యాణం



శ్రీకృష్ణ కల్యాణోత్సవంలో పాల్గొన్న తన్నీరు

రామచంద్రునిపేట(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీరాధ రుక్మిణీ సత్యభామ సహిత శ్రీకృష్ణ స్వామి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై ఉంచి అర్చకులు జొన్నబొట్ల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, వైఎస్సార్ సీపీ నియోజక సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్సై తోట సూర్యశ్రీనివాస్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నవరంలో...

మండలంలోని అన్నవరం సమీపంలో కొండపై వేంచేసి ఉన్న శ్రీవలస శిఖర లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిరునాళ్ల విజయవంతానికి సహకరించాలి: ఏసీపీ



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఏసీపీ తిలక్, పక్కన సీఐ వెంకటేశ్వర్లు


పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్లలో భాగంగా ప్రధాన ఘట్టమైన అనిగండ్లపాడు గ్రామం నుంచి సోమవారం వచ్చే పసుపు కుంకుమల బండ్లు కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని నందిగామ ఏసీపీ తిలక్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ రాజకీయపార్టీల నాయకులు, పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టింటి పసుపు-కుంకుమల కార్యక్రమానికి భారీగా భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా విస్తృత బందోబస్తు నిర్వహిస్తామన్నారు. పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. మైక్‌ల్లో రెచ్చగొట్టే మాటలు, పాటలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ అర్జున్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు, గ్రామాధ్యక్షుడు యానాల సురేష్, టీడీపీ నాయకులు పొందూరు సుధాకర్, తొట్టెంపూడి మురళి, మాదినేని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో తిరునాళ్ల సందడి



అమ్మవారిని వేడుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్లకు రెండవరోజు శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి రథోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద చిన్నారుల కూచిపూడి, భరతనాట్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాటకాల పదర్శన ప్రత్యేకార్షణగా నిలిచింది.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రజలు



భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శనివారం విజయవాడకు చెందిన శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీకి చెందిన కళాబృందం నృత్య నీరాజనాలను అర్పించింది. నాట్యాచార్య చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ ఆధ్వర్యంలో 25మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు వారికి ప్రసాదాలను అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



నందిగామలో ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ కృష్ణకుమారి, ఆర్డీవో బాలకృష్ణ, కమిషనర్ తదితరులు



ధర్మవరప్పాడుతండలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

నందిగామటౌన్: ప్రతిఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆర్డీవో కె.బాలకృష్ణ సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ తడిపొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని ప్రజలను కోరారు. అనంతరం మానవహారం నిర్వహించి స్వచ్ఛత పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు .

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్‌వాడకంతో కలిగే అనర్థాలపై ముక్త్యాల, గౌరవరం, ధర్మవరప్పాడుతండ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల కార్యదర్శులు శ్రీనివాస రెడ్డి, సంక్రాంత్, సైదానాయక్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడిపొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీలు, వెలుగు, ఉపాధిహామీ పథకం సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: మండలంలోని అడవిరావులపాడు, తొర్రగుడిపాడు గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ ఆకుల హనుమంతరావు(రంగా)మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పేర్కొన్నారు. సర్పంచ్ చెరుకూరు హైమారావు, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని పరిటాల, కంచికచర్లలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. సర్పంచులు వేల్పుల సునీత, యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఈఓపీఆర్డీ బీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు వీ బ్రహ్మం, ఎస్ సుబ్రహ్మణ్యం, పారిశుద్ధ్య కార్మికులు, అంగనవాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు..

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్ సమీపంలోని చెత్తాచెదారాలను ఎక్సైజ్ సీఐ అప్పుపున్నీసా బేగం, సిబ్బంది శనివారం తొలగించారు. సీఐ మాట్లాడుతూ అందరూ మొక్కలు నాటాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్ఐ షేక్ గాలిబ్‌సాహెబ్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కమిషనర్ రామ్మోహనరావు, తహసీల్దార్ మనోహర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



అడవిరావులపాడులో అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది



జగ్గయ్యపేట పట్టణంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు



పరిటాలలో మానవహారం నిర్వహిస్తున్న సర్పంచి ఆనందజ్యోత్స్న, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు

వత్సవాయిలో రెండు పరీక్ష కేంద్రాలు

వత్సవాయి : ఈనెల 17వతేదీ నుంచి జరుగనున్న పదోతరగతి పరీక్షలకు మండలం నుంచి 405మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎల్ నాగరాజు శనివారం తెలిపారు. మండలంలో 9 ప్రభుత్వ, నాలుగు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. భీమవరం, మంగొల్లు జెడ్పీ పాఠశాలల విద్యార్థులు జగ్గయ్యపేట మండలంలో పరీక్షలు రాయనుండగా మిగతా పాఠశాలల విద్యార్థులు వత్సవాయి జెడ్పీ పాఠశాలలోని రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాస్తారన్నారు. పరీక్షలు హాజరయ్యేవారిలో బాలురు 239మంది, బాలికలు 166మంది ఉన్నారని ఆయన వివరించారు. పరీక్ష ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు కావలసిన మంచినీరు. వైద్య సదుపాయాలు కల్పించినట్లు ఎంఈఓ వివరించారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నందిగామ రూరల్: అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కామినేని హాస్పిటల్ ప్రతినిధి సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే శిబిరంలో గుండె, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్‌తోపాటు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.3వేల విలువ చేసే పలురకాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జగ్గయ్యపేట, జగ్గయ్యపేటఅర్బన్ : పదోతరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో ఎల్.చిట్టిబాబు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభమయ్యే టెన్త్ పరీక్షల కోసం పేట పట్టణంతోపాటు మండలంలో 17 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలి వివరించారు. మొత్తం 1,610 మంది రెగ్యులర్ విద్యార్థులు ఈపరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలు, జెడ్పీ బాలికల హైస్కూల్, తపోవన్ విద్యాలయం, విజ్ఞాన్ హైస్కూల్, శ్రీచైతన్య స్కూల్, చేగు విద్యాలయం, పేట మండలంలో చిల్లకల్లులోని ఆల్ సెయింట్స్ హైస్కూల్, జెడ్పీ హైస్కూల్, గండ్రాయిలోని జడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఓపెన్ టెన్త్ విద్యార్థుల కోసం పేట పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో రెండు కేంద్రాలు, జెడ్పీ బాలికల హైస్కూల్, తపోవన్, శ్రీచైతన్య, చేగు విద్యాలయం, విజ్ఞాన్ హైస్కూళ్లలో కలిపి ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల విధుల కోసం 17 మంది సీఎస్‌లు, 17 మంది డీవోలు, 106 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. పాఠశాలల పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అన్ని స్కూళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ఉదయం 9.30గంటలకు ప్రారంభమై 12.45 గంటలకు ముగుస్తుందని వివరించారు. విద్యార్థులు నిర్ణీత సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఎంఈఓ సూచించారు.